
సాక్షి
పల్నాడు
శుక్రవారం । 27 । జనవరి । 2023



పులిచింతల నీటి నిల్వ


అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 42.2760 టీఎంసీలు ఉండగా ప్రాజెక్టు దిగువకు 4,200 క్యూసెక్కులు వదులుతున్నారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్: కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద గురువారం 2416 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. కొమ్మమూరు కాల్వకు 1179 క్యూసెక్కులు వదిలారు.

కరోనా జీరో



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా బుధవారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. ఎక్కడా మరణాలు సంభవించలేదు.

న్యూస్‌రీల్

జిల్లా కోర్టులో గణతంత్ర వేడుకలు



గుంటూరు లీగల్: గణతంత్ర వేడుకలు జిల్లా కోర్టు ప్రాంగణంలో గురువారం జరిగాయి. జిల్లా ప్రధాన న్యాయస్థానం దగ్గర జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి.పార్థసారధి జాతీయ జెండాను ఆవిష్కరించారు. పాత బార్ అసోసియేషన్ వద్ద గుంటూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పాలడుగు వెంకటేశ్వర్లు, న్యాయశాఖ ఉద్యోగుల భవనం వద్ద న్యాయశాఖ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు పాపిరెడ్డి జాతీయ జెండాలను ఆవిష్కరించారు. మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా కోర్టు, సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, జూనియర్ సివిల్ జడ్జి కోర్టుల న్యాయమూర్తులు, న్యాయశాఖ ఉద్యోగులు, బార్ అసోసియేషన్ కార్యవర్గం, బార్ కౌన్సిల్ సభ్యులు, జీపీ, ఏపీపీలు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

జస్టిస్ గోపాలకృష్ణారావుకు సన్మానం



గుంటూరు లీగల్: ఒకటో అదనపు జిల్లా జడ్జి వెణుతరుమల్లి గోపాలకృష్ణారావు ఏపీ హైకోర్టుకు అదనపు న్యాయమూర్తిగా నియమితులైన విషయం తెలిసిందే. శుక్రవారం హైకోర్టు మొదటి కోర్టు హాలులో ఆయన ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ నేపథ్యంలో గురువారం గణతంత్ర వేడుకల అనంతరం న్యాయశాఖ ఉద్యోగుల భవనంలో గోపాలకృష్ణారావును జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి.పార్థసారధి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా కోర్టు, సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, జూనియర్ సివిల్ జడ్జి కోర్టుల న్యాయమూర్తులు, న్యాయశాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

జెడ్పీ సీఈఓగా మోహనరావు
మాతృశాఖకు శ్రీనివాసరెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లా పరిషత్ సీఈఓగా జె.మోహనరావు పూర్తి అదనపు బాధ్యతల (ఎఫ్ఏసీ)పై నియమితులయ్యారు. గుంటూరు జిల్లాలో ఎంపీడీఓగా పని చేస్తూ ఇటీవల ఉద్యోగోన్నతిపై గుంటూరు డీఎల్‌డీఓగా పోస్టింగ్ పొందిన మోహనరావును జెడ్పీ డెప్యూటీ సీఈఓగా నియమిస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది బుధవారం ఉత్తర్వులు విడుదల చేశారు. డెప్యూటీ సీఈఓగా రెగ్యులర్ ప్రాతిపదికన పోస్టింగ్ పొందిన మోహనరావుకు సీఈఓగా ఎఫ్ఏసీ బాధ్యతలు అప్పగించారు. అలాగే ప్రస్తుతం డెప్యూటీ సీఈఓగా పని చేస్తున్న వి.సుజాతను బదిలీ చేస్తూ ప్రభుత్వానికి రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రస్తుతం జెడ్పీ సీఈఓగా పని చేస్తున్న డాక్టర్ జి.శ్రీనివాసరెడ్డిని ఆయన మాతృశాఖ అయిన పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పంపించారు.

పతాక సందేశం

- సమగ్రాభివృద్ధి.. సగర్వంగా..
- అన్ని రంగాల్లోనూ కొత్తజిల్లా ముమ్ముందుకు..
- నవరత్నాలతో ఇంటింటా సంక్షేమ సిరులు
- కలెక్టర్ శివశంకర్ వెల్లడి
- అట్టహాసంగా గణతంత్ర దినోత్సవం

కాంతిపుంజం త్రివర్ణశోభితమై మెరిసినట్టు.. జనుల మోములు మిలామిలా మెరిశాయి. ఇంటింటా సిరులు కురిపించిన నవరత్నాలు పొదిగిన సంక్షేమ వజ్రవైడూర్యాలు నడివీధిలో కవాతు చేసినట్టు.. విజయ శకటాలు సంతోష శంఖం పూరించాయి. గణతంత్ర సంబరాలు అంబరాన్ని తాకినట్టు.. ప్రగతి పతాక గగనాన సగర్వంగా రెపరెపలాడింది. జనగణమన అంటూ జైత్రయాత్ర చేసింది. పల్నాడు జిల్లా నరసరావుపేటలోని జిల్లా క్రీడా ప్రాంగణం గురువారం సరికొత్త శోభతో తళతళలాడింది. సాంస్కృతిక ప్రదర్శనలతో ఆహూతులను ఆద్యంతం సంభ్రమాశ్చర్యాలకు గురిచేసింది.

సాక్షి, నరసరావుపేట: కొత్తగా ఏర్పడిన పల్నాడు జిల్లా అన్ని రంగాల్లోనూ పురోగమిస్తోందని కలెక్టర్ లోతేటి శివశంకర్ చెప్పారు. గురువారం నరసరావుపేటలోని జిల్లా క్రీడా ప్రాంగణంలో జరిగిన గణతంత్ర వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ అందరం అభివృద్ధికి పునరంకితమవుదామని పిలుపునిచ్చారు. ఉత్తమ సేవలందించిన ఉద్యోగులు, అధికారులను సత్కరించారు. అనంతరం ప్రదర్శించిన సాంస్కృతిక అంశాలు అలరించాయి. కార్యక్రమంలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి, జేసీ శ్యాం ప్రసాద్, అడ్మిన్ ఎస్పీ బిందుమాధవ్, ఇతర అధికారులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

కలెక్టర్ ప్రసంగంలో ముఖ్యాంశాలు..

- 'నవ రత్నాలు పేదలందరికీ ఇళ్లు' పథకంలో భాగంగా జిల్లాలో 1,10,324 మందికి ఇళ్లపట్టాలను ప్రభుత్వం పంపిణీ చేసిందని కలెక్టర్ చెప్పారు. రూ.286.94 కోట్లతో 2,853.18 ఎకరాల్లో 859 లే అవుట్లను అభివృద్ధి చేసి ఇళ్ల పట్టాలు పంపిణీ చేసినట్టు వివరించారు.
- జగనన్న భూరక్ష పథకం ద్వారా జిల్లాలో 359 రెవెన్యూ గ్రామాల్లో డ్రోన్ల ద్వారా రీ సర్వే శరవేగంగా జరుగుతోందని కలెక్టర్ చెప్పారు. ఇప్పటికే 76 రెవెన్యూ గ్రామాల్లో 1,65,156 ఎకరాల్లో రీసర్వే పూర్తయినట్టు వివరించారు. భూ యజమానులకు హక్కు పత్రాలను జారీ చేస్తున్నామని చెప్పారు.
- వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా 100 ప్రభుత్వ, ప్రైవేట్ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో 3,255 రకాల జబ్బులకు పూర్తి ఉచితంగా వైద్యం అందిస్తున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. ఇప్పటివరకు రూ.408.86 కోట్లతో 1.66 లక్షల మందికి ఉచితంగా వైద్యం అందించామని వివరించారు.
- వైఎస్సార్ రైతు భరోసా ద్వారా జిల్లాలోని 2.64 లక్షల రైతు కుటుంబాలకు మూడు విడతల్లో రూ.1,301 కోట్ల పెట్టుబడి సాయం అందజేశామని కలెక్టర్ తెలిపారు. వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం ద్వారా మూడేళ్లలో 1.42 లక్షల మంది రైతులకు రూ.144 కోట్లు పంపిణీ చేశామని వివరించారు.
- జగనన్న అమ్మ ఒడి పథకం ద్వారా 1.93 లక్షల మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.289 కోట్లు జమ చేశామని కలెక్టర్ తెలిపారు. మూడేళ్లలో జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన ద్వారా రూ.249 కోట్ల ప్రయోజనం చేకూర్చినట్టు వెల్లడించారు. మనబడి నాడు-నేడు రెండో దశలో 907 ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో రూ.306.95 కోట్లతో మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తున్నామని చెప్పారు.
- వైఎస్సార్ సామాజిక పెన్షన్ కానుక ద్వారా జిల్లాలో 2.72 లక్షల మందికి రూ.75.57 కోట్లు ప్రతి నెలా పంపిణీ చేస్తున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు ఉపాధి హామీ పథకం ద్వారా 63.5 లక్షల పని దినాలు కల్పించామని వివరించారు. జిల్లాలో 43 భారీ, మెగా పరిశ్రమలను రూ.2,212 కోట్ల పెట్టుబడితో స్థాపించడంతో 15 వేల మందికి ఉపాధి లభిస్తోందని పేర్కొన్నారు.



జెండా వందనం : జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వందనం చేస్తున్న కలెక్టర్ శివశంకర్ లోతేటి చిత్రంలో ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, పోలీసు అధికారులు (అంతరచిత్రం) ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తున్న కలెక్టర్ శివశంకర్



పోరాట స్ఫూర్తికి పట్టం : స్వాతంత్ర్య సమరయోధుడిని సత్కరిస్తున్న ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, జేసీ శ్యామ్‌ప్రసాద్, ఏఎస్పీ బిందుమాధవ్



విద్యయోస్తు : ఆకట్టుకున్న విద్యాశాఖ శకటం



ఆనంద నర్తనం : చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన

ప్రభుత్వ పాఠశాలల నవీకరణతో మంచి రోజులు

- ప్రభుత్వ ముందుచూపుతో పూర్వ వైభవం చూస్తున్నాం
- కార్పొరేట్ విద్యా వ్యవస్థతో ఏం లాభమనేది తల్లిదండ్రులే ఆలోచించుకోవాలి
- గత 30 ఏళ్లలో కార్పొరేట్ వ్యవస్థతో సాధించిందేముంది
- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్
- ఘనంగా గుంటూరు మాజేటి గురవయ్య హైస్కూల్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలలను ఆధునికీకరించడం ద్వారా విద్యావ్యవస్థలో ఆశాజనక పరిణామాలను చూస్తున్నామని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ చెప్పారు. గుంటూరు బ్రాడీపేటలోని మాజేటి గురవయ్య హైస్కూల్ పూర్వ విద్యార్థుల వార్షిక సమ్మేళనాన్ని గురువారం సాయంత్రం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పాఠశాల పూర్వ విద్యార్థి జస్టిస్ కృష్ణమోహన్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్న తీరుతో సర్కారు విద్యావ్యవస్థకు మంచి రోజులు వచ్చాయని చెప్పారు. కార్పొరేట్ విద్యాసంస్థల రాకతో గత 30 ఏళ్లలో విద్యారంగంలో ఎన్నో మార్పులు వచ్చాయని, అయితే కార్పొరేట్ వ్యవస్థతో విద్యార్థులకు ఎటువంటి లాభం చేకూరిందనే విషయాన్ని తల్లిదండ్రులు పునరాలోచన చేయాలని అన్నారు. ప్రభుత్వ, ఎయిడెడ్ రంగంలో ఎంతో పేరు, ప్రఖ్యాతలు గడించిన మంచి విద్యాసంస్థలు కార్పొరేట్ వ్యవస్థతో పోటీ పడలేక కనుమరుగయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. మళ్లీ ప్రభుత్వ పాఠశాలల వైభవాన్ని చూడాలని మనసారా కోరుకుంటున్నానని పేర్కొన్నారు. గతంలో కళాశాల విద్య తరువాత ఇంజినీరింగ్ చదువులకు కోచింగ్ పొందేవారని, ప్రస్తుతం 8వ తరగతి నుంచే ఐఐటీ కోచింగ్‌ల పేరుతో విద్యార్థులపై కార్పొరేట్ విద్యాసంస్థలు ఒత్తిడి తెస్తున్నాయని చెప్పారు. విద్యావ్యవస్థకు పూర్వ వైభవాన్ని తెచ్చేందుకు పూర్వ విద్యార్థులు తమ వంతు బాధ్యత తీసుకోవాలని సూచించారు. తాను మాజేటి గురవయ్య హైస్కూల్లో 1977–80 మధ్య కాలంలో 8,9,10 తరగతులు చదివానని గుర్తు చేసుకుని, నాడు తనకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయుల పేర్లను చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థి, కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ, పూర్వ విద్యార్థి సంఘ ప్రతినిధులు ఎంపీడీ భానుప్రసాద్, కె.రామ్‌నాథ్‌బాబు, ఎం.కోదండ రామారావు, న్యాయవాది చుండూరు సుందరరామ శర్మ, మాజేటి ఎంవీఆర్‌కే ముత్యాలు, పాఠశాల కార్యదర్శి మాజేటి వీఎస్ఆర్ ప్రసాద్, హెచ్‌ఎం శారదాదేవి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్

సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు



ముఖ్యమంత్రి సభా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న మంత్రులు రజిని, అంబటి, ఎమ్మెల్సీ రఘురాం, ఎమ్మెల్యే బొల్లా

వినుకొండ(నూజెండ్ల): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 30వ తేదీ వినుకొండ పర్యటన నేపథ్యంలో మంత్రులు విడదల రజిని, అంబటి రాంబాబు ముఖ్యమంత్రి ప్రోగ్రామ్స్ కో–ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. వినుకొండ మున్సిపల్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్, ఎస్పీ రవిశంకర్ రెడ్డితో పాటు పలువురు ఉన్నతాధికారులు మున్సిపల్, రెవెన్యూ, పోలీస్, ఇతర శాఖల అధికారులతో ముఖ్యమంత్రి సభా ప్రాంగణం, హెలీప్యాడ్, భద్రత ఏర్పాట్లు, ట్రాఫిక్ తదితర అంశాలపై చర్చించారు. అనంతరం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ముఖ్యమంత్రి హెలికాప్టర్ దిగేందుకు వీలుగా స్థలాన్ని ఎంపిక చేశారు. వెల్లటూరు రోడ్డులోని బొల్లా బ్రహ్మనాయుడు ఎస్టేట్‌లో ముఖ్యమంత్రి సభా ప్రాంగణం ఎంపిక చేసినట్లు తెలిపారు.

సీఎం సభను విజయవంతం చేయాలి..

ఈ సందర్భంగా మీడియాతో మంత్రులు విడదల రజిని, అంబటి రాంబాబు, ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న చేదోడు పథకం సభ వినుకొండలో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమానికి వేలాదిగా ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనత అదుపునకు ప్రణాళికతో ముందుకు

- రక్తహీనత బారిన పడుతున్న గర్భిణులు, బాలింతలు, బాలికలు
- ప్రతి ఒక్కరిని పరీక్షించి, రక్తహీనత స్థాయిని బట్టి వైద్యం అందిస్తున్న ప్రభుత్వం
- అంగన్‌వాడీ, హెల్త్ సెంటర్ల ద్వారా పౌష్టికాహారం అందజేత
- 15–49 ఏళ్ల మధ్య మహిళలందరికీ ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు పంపిణీ
- రక్తహీనత పారదోలడమే లక్ష్యంగా పనిచేస్తున్నామంటున్న కలెక్టర్ శివశంకర్

సాక్షి, నరసరావుపేట: బాలికలు మొదలు మహిళల వరకు రక్తహీనత ప్రమాదం పొంచిఉంది. రక్తహీనత బారిన పడి ఎన్నో అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. వాటిని తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పటిష్టమైన ప్రణాళికలు అమలు చేస్తోంది. 15–49 ఏళ్ల మధ్య ఆడపిల్లలు, మహిళలు రక్తహీనత బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా టెస్ట్ అండ్ ట్రీట్ విధానాన్ని అమలు చేస్తున్నారు. జిల్లాలోని ప్రతి ఏఎన్ఎంకు ప్రభుత్వం హెచ్‌బీ టెస్ట్ మీటర్‌ని అందజేసింది. వారి పరిధిలోని వారందరికీ రక్తహీనత పరీక్షలు నిర్వహిస్తున్నారు. సచివాలయ పరిధిలోని ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు సమీపంలోని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థి ఎత్తు, బరువు, హిమోగ్లోబిన్ (హెచ్‌బీ), చెవుడు, కంటి, ఇతర అనారోగ్య సమస్యలుంటే గుర్తించి నమోదు చేశారు. ప్రభుత్వ బడుల్లో జగనన్న గోరుముద్ద పథకం ద్వారా నాణ్యమైన పౌష్టికాహారం పిల్లలకు అందుతుండటంతో గతంతో పోల్చితే బాలికల్లో రక్తహీనత బాగా తగ్గుదల కనిపిస్తోందని వైద్యాధికారులు చెబుతున్నారు. కొంత మంది బాలికలు పౌష్టికాహారం తీసుకోకపోవడంతో రక్తహీనత బారిన పడుతున్నారని వాపోతున్నారు. రక్తహీనత కలిగిన విద్యార్థుల వివరాలు ఎప్పటికప్పుడు ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నారు. తక్కువ హిమోగ్లోబిన్ ఉన్న వారిని గుర్తించి, వారి స్థాయినిబట్టి, వయసు ఆధారంగా చికిత్స అందజేస్తున్నారు.



నరసరావుపేటలో విద్యార్థులకు రక్తహీనతను పరీక్షిస్తున్న డీఎంహెచ్ఓ శోభారాణి


ప్రతి వారం ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్ర..

రక్తంలో హిమోగ్లోబిన్ శాతం 11 గ్రాముల కంటే తక్కువగా ఉంటే రక్తహీనతగా పరిగణిస్తారు. అదే 7 గ్రాముల కంటే తక్కువగా ఉంటే తీవ్ర రక్తహీనత కేసులుగా నమోదు చేస్తారు. ఇది వయసును బట్టి కొంత మార్పు ఉంటుంది. రక్తహీనత లేకున్నా ముందు జాగ్రత్తలో భాగంగా 15–49 ఏళ్ల మధ్య వారందరికీ ప్రతి గురువారం ఓ ఐరన్ ఫోలిక్ యాసిడ్ బిళ్లను వేసుకునేలా ఏఎన్ఎంల ద్వారా సరఫరా చేస్తున్నారు. రక్తహీనత మధ్యస్థంగా ఉన్న వారికి 180 రోజుల పాటు వారానికి రెండు బిళ్లలు అందజేయనున్నారు. రక్తహీనత అధికంగా ఉన్నవారికి ఇంజక్షన్‌తో చికిత్స అందజేయనున్నారు. అవసరమైతే వారికి రక్తం అందించనున్నారు. గర్భిణులు, బాలింతలపై మరింత ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. వారికి నెలకు ఒకసారి తప్పకుండా హెచ్‌బీ టెస్ట్ చేసి, అవసరమైన చికిత్స అందజేస్తున్నారు. వారికి ఇంటి వద్దకే అంగన్‌వాడీల ద్వారా మంచి పౌష్టికాహారం అందజేస్తున్నారు.

పల్నాడు జిల్లాలో రక్తహీనత బారిన పడిన వారి వివరాలు..

విభాగం	నమోదైన వారి సంఖ్య	రక్తహీనతతో బాధపడుతున్న వారిసంఖ్య
గర్భిణీలు	25,113	13,865
బాలింతలు	20,795	11,011
10–19 ఏళ్ల అమ్మాయిలు	1,03,694	55,738

టెస్ట్ అండ్ ట్రీట్ విధానం అమలు చేస్తున్నాం



15–49 ఏళ్ల మధ్య గల ఆడపిల్లలు, మహిళల్లో రక్తహీనత తగ్గించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నాం. పాఠశాలల వారీగా ఈ సమస్యతో బాధపడేవారిని గుర్తించి, వారిపై ప్రత్యేక దృష్టి పెడుతున్నాం. గర్భిణులు, బాలింతలను నిరంతరం పర్యవేక్షించి అవసరమైన మందులు, పౌష్టికాహారం అందజేసి, మాతాశిశు మరణాలను తగ్గిస్తున్నాం. టెస్ట్ అండ్ ట్రీట్ విధానం అమలు చేస్తున్నాం. ఈ చర్యలు నిరంతరం సాగుతాయి.

–శివశంకర్ లోతేటి, జిల్లా కలెక్టర్

జెడ్పీలో గణతంత్ర ఉత్సవం



గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లా పరిషత్ ప్రాంగణంలో గురువారం నిర్వహించిన గణతంత్ర దినోత్సవానికి జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా సురేష్‌కుమార్ గౌరవ అతిథిగా హాజరయ్యారు. సీఈఓ డాక్టర్ జి.శ్రీనివాసరెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన జిల్లాస్థాయి వేడుకల్లో కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకున్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా శ్రీనివాసరెడ్డితోపాటు ప్రశంసపత్రాలు అందుకున్న జెడ్పీ ఉద్యోగులను అభినందించారు.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: తెనాలి మార్కెట్‌యార్డులో గురువారం క్వింటా నిమ్మకాయల కనిష్ఠ ధర రూ.1,400, గరిష్ఠ ధర రూ.2,100, మోడల్ ధర రూ.1,700 వరకు పలికింది.



భారత్ కీర్తి మెరుగౌను

గణతంత్ర దినోత్సవం సందర్భంగా చిలకలూరిపేట ఏఎంజీ స్కూల్‌లో సంబరాలు అంబరాన్నంటాయి. ఓ విద్యార్థిని జాతీయ జెండా రంగులతో రూపొందించిన భారీ గౌను ధరించి అందరినీ సంభ్రమాశ్చర్యాల్లో ముంచెత్తింది. భారత్ కీర్తి మెరు'గౌనని' నినదించింది.

– చిలకలూరిపేట

గణతంత్ర సంబరం..

సేవకు వందనం

74వ భారత గణతంత్ర దినోత్సవ వేడుకలు జిల్లాలో ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. గురువారం నరసరావుపేటలోని జిల్లా క్రీడా ప్రాంగణంలో జరిగిన గణతంత్ర సంబరాలు అంబరాన్నంటాయి. వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ప్రదర్శించిన శకటాలు జిల్లా ప్రగతిని తెలియజేశాయి. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి, జాతీయ జెండాకు వందనం చేశారు. ఉత్తమ సేవలు అందించిన ప్రభుత్వ ఉద్యోగులను ప్రశంసా పత్రాలతో సత్కరించారు.

– సాక్షి, నెట్‌వర్క్



జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి చేతుల మీదగా అవార్డు అందుకుంటున్న జిల్లా అటవీ శాఖ అధికారి రామచంద్రరావు



ప్రశంసా పత్రం అందుకుంటున్న నవోదయం నోడల్ ఆఫీసర్ సంజీవరావు



పీడీ వేణుగోపాల్, జిల్లా గృహ నిర్మాణ శాఖ



టీసీ వెంకటేశ్వర్లు, లీడ్ బ్యాంక్ మేనేజర్



పి. సునీల, ఆరోగ్యశ్రీ జిల్లా కో-ఆర్డినేటర్



డి.వరలక్ష్మి, ఇరిగేషన్ ఎస్ఈ



ఐ.శ్రీనివాసరెడ్డి, పబ్లిక్ హెల్త్ అండ్ మున్సిపల్ ఇంజనీరింగ్ ఆఫీసర్



డి. రవీంద్ర, మున్సిపల్ కమిషనర్ నరసరావుపేట



వై.నాగశేఖర్, ఏడీ సర్వే



బి.బాలు నాయక్, పీడీ, డీఆర్‌డీఏ



టీకే పరంధామరెడ్డి, డీటీసీ



వి.సుభాషిణి, వీఆర్‌వో, గొట్టిపాడు



కె.బ్రహ్మయ్య, వ్యవసాయ విస్తరణ అధికారి



కె.సంతోష్‌కుమార్, సహాయసాంఘిక సంక్షేమ శాఖ అధికారి



షేక్ మస్తాన్‌వలి, టూరిజం ఎగ్జిక్యూటివ్



పద్మారావు, విద్యాశాఖ ఏఎస్‌వో



వి.గోపి, పౌరసంబంధాల అధికారి



జి.వెంకటేశ్వరరావు, సమాచార శాఖ సాంకేతికులు



శ్రీనివాస్, సీనియర్ ఇన్‌స్పెక్టర్ కోఆపరేటివ్ కార్యాలయం



పుణ్యాల వెంకటరెడ్డి, ఫస్ట్ గ్రేడ్ ఈవో



ఏ.శ్రీనివాసరావు, సత్తెనపల్లి, ఎంఈవో



వెంకటేశ్వర్లు, కోఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్, సత్తెనపల్లి



కె.నాగరాజు, పిడుగురాళ్ల మండల వెలుగు సీసీ



షేక్ బాజీమస్తాన్, సీనియర్ ఆడిటర్



ఏల్చూరి ఏడుకొండలు, విద్యుత్ శాఖ డీఈఈ



వేమారెడ్డి, పశుసంవర్ధకశాఖ సహాయకుడు



వి.రాంబాబు, స్కౌట్ మాస్టర్



దాసరి నవీన్‌కుమార్, ఉద్యానశాఖ అధికారి



శ్రీనివాసరావు, ఎంపీడీవో నరసరావుపేట



కె.హరనాథ్, పీఆర్ డీఈఈ



రామలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి జొన్నలగడ్డ



రామాంజనేయులు, డీఆర్‌డీఏ ఏపీవో

డీఎస్పీ శ్రీనివాసరెడ్డికి పోలీసు ప్రతిభ పురస్కారం

యర్రంవారిపాలెం (కారంచేడు): పోలీసు ప్రతిభ పురస్కారానికి మండలంలోని యర్రంవారిపాలెం గ్రామానికి చెందిన యర్రం శ్రీనివాసరెడ్డి ఎంపికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి గురువారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ప్రస్తుతం ఈయన నంద్యాల జిల్లా డోన్ డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ విషయం తెలిసిన గ్రామస్తులు ఆనంద డోలికల్లో తేలియాడారు. ఆయనకు ఫోన్ ద్వారా అభినందనలు తెలిపారు. గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు యర్రం రాఘవరెడ్డి దంపతుల కుమారుడే శ్రీనివాసరెడ్డి. చిన్నతనం నుంచే తండ్రి ఆశయాలు, పోరాట ప్రతిమ కలిగిన శ్రీనివాసరెడ్డి ప్రజలకు సేవ చేయాలనే తలంపుతోనే పోలీసుశాఖను ఎన్నుకున్నారు.

బౌలర్లదే విజయం

ఉత్కంఠభరితంగా సాగుతున్న సాక్షి ప్రీమియర్ లీగ్

Regional sponsor District sponsor

నరసరావుపేట ఈస్ట్: సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల క్రీడా మైదానంలోని క్రికెట్ గ్రౌండ్‌లో ఉత్కంఠభరితంగా కొనసాగుతున్నాయి. పోటీల్లో భాగంగా రెండవ రోజు గురువారం మూడు మ్యాచ్‌లు నిర్వహించారు. మ్యాచ్‌లకు అంపైర్లుగా పి.అజయ్, కె.నవీన్‌రెడ్డి, జె.కోటేశ్వరరావు వ్యవహరించారు. ఎన్ఈసీ కళాశాల పీడీ ఎల్.కృష్ణారెడ్డి, నిట్ కళాశాల పీడీ రాజేంద్రబాబు మ్యాచ్‌లను పర్యవేక్షించారు.

నేడు తలపడనున్న జట్లు ఇవే..

నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ మ్యాచ్‌లో భాగంగా శుక్రవారం మూడు మ్యాచ్‌లు జరగనున్నాయి. మొదటి మ్యాచ్ నరసరావుపేట ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ- బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల జట్ల మధ్య జరగనుండగా, రెండవ మ్యాచ్ ఎస్‌కేఆర్‌బీఆర్ డిగ్రీ కళాశాల- విట్ యూనివర్సిటీ కళాశాల జట్టు, మూడవ మ్యాచ్ జేఎన్‌టీయూ-ఎన్ ఇంజనీరింగ్ కళాశాల- ఎస్ఆర్ఎం యూనివర్సిటీ కళాశాల జట్ల మధ్య నిర్వహించనున్నారు.

ఎన్ఈసీ ఘన విజయం..



తొలి మ్యాచ్ విజేత ఎన్ఈసీ జట్టు (ఇన్‌సెట్) మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ గణేష్

సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీల్లో భాగంగా గురువారం నిర్వహించిన మొదటి మ్యాచ్‌లో నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల జట్టు బౌలింగ్, బ్యాటింగ్‌లో ఆధిక్యత కనబరిచి సత్తెనపల్లి లయోలా ఇంజనీరింగ్ కళాశాల జట్టుపై ఏడు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. జట్టు విజయంలో వికెట్ కీపర్ యశ్వంత్ రెండు స్టంప్‌లు, రెండు రనౌట్లు చేసి కీలకపాత్ర పోషించాడు. తొలుత టాస్ గెలిచిన ఎన్ఈసీ జట్టు బౌలింగ్ ఎంచుకోగా బ్యాటింగ్‌కు దిగిన లయోలా జట్టు నిర్ణీత పది ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి 66 పరుగులు చేసింది. లయోలా బ్యాట్స్‌మెన్‌ల మధ్య సరైన అవగాహన లేకపోవటంతో కీలక సమయంలో రనౌట్లకు గురై తక్కువ స్కోరుకే ఇన్నింగ్స్ ముగించారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఎన్ఈసీ జట్టు 6.2 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 67 పరుగులు చేసి విజయం సాధించింది.

బ్యాటింగ్, బౌలింగ్‌లో రాణించి..



రెండవ మ్యాచ్ విజేత ఈశ్వర్ కళాశాల జట్టు (ఇన్‌సెట్) మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ నాగార్జున

రెండవ మ్యాచ్‌లో ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాల జట్టు బ్యాటింగ్, బౌలింగ్‌లో రాణించి ఏఎం రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల జట్టుపై విజయం సాధించింది. టాస్ గెలిచిన ఈశ్వర్ కళాశాల జట్టు బౌలింగ్ ఎంచుకోగా బ్యాటింగ్‌కు దిగిన ఏఎం రెడ్డి కళాశాల జట్టు నిర్ణీత పది ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 72 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఈశ్వర్ కళాశాల జట్టు 7.3 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 78 పరుగులు చేసి విజయం సాధించింది. జట్టులోని గోపి 13 బంతుల్లో ఐదు ఫోర్లు, ఒక సిక్సర్‌తో 29 పరుగులు సాధించాడు. బౌలర్ నాగార్జున రెండు ఓవర్లలో 22 పరుగులు ఇచ్చి మూడు వికెట్లు సాధించి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ కైవసం చేసుకున్నాడు.

చేజ్ చేయలేక చతికలపడ్డ ఏఎం రెడ్డి ఫార్మసీ..



మూడవ మ్యాచ్ విజేత నలందా జట్టు (ఇన్‌సెట్) మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ రాకేష్

ఉత్కంఠభరితంగా జరిగిన మూడవ మ్యాచ్‌లో సత్తెనపల్లి నలందా ఫార్మసీ కళాశాల జట్టు నాలుగు వికెట్ల తేడాతో ఏఎం రెడ్డి ఫార్మసీ కళాశాల జట్టుపై విజయం సాధించింది. టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న ఏఎం రెడ్డి ఫార్మసీ జట్టు నలందా జట్టును 100 పరుగులకు కట్టడి చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఏఎం రెడ్డి జట్టు ఛేజింగ్‌లో విఫలమై నిర్ణీత పది ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 94 పరుగులు చేసి ఓటమి పాలైంది. నలందా జట్టులోని రాకేష్ 32 పరుగులతో బ్యాటింగ్‌లో మెరవడంతో పాటు బౌలింగ్‌లో రాణించి ఒక వికెట్ సాధించి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ దక్కించుకున్నాడు.

హక్కులు, అధికారాలను కాపాడతాం

- జిల్లా ప్రజలకు హామీ ఇచ్చిన ఎస్పీ రవిశంకర్‌రెడ్డి
- జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా గణతంత్ర వేడుకలు



జాతీయ పతాకం ఎగుర వేసి సెల్యూట్ చేస్తున్న ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, అదనపు ఎస్పీ బిందుమాధవ్

నరసరావుపేట: భారత రాజ్యాంగం పౌరులకు కల్పించిన హక్కులు, అధికారాలను కాపాడుతూ వాటిని స్వేచ్ఛగా అనుభవించేందుకు అహర్నిశలు కృషి చేస్తామని జిల్లా పోలీస్ శాఖ తరపున హామీ ఇస్తున్నామని ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి, పోలీస్ అధికారులు స్పష్టం చేశారు. 74వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం ఘనంగా గణతంత్ర దినోత్సవాన్ని నిర్వహించారు. జాతిపిత మహాత్మా గాంధీ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. త్రివర్ణ పతాకాన్ని ఎస్పీ, పోలీస్ అధికారులు ఎగురవేయగా, పోలీసు సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. జిల్లా అదనపు ఎస్పీ జి.బిందుమాధవ్, డీఎస్పీలు సి.విజయభాస్కర్‌రావు, షేక్ షరీఫుద్దీన్, యు.రవిచంద్ర, జయరాం ప్రసాద్, చిన్నికృష్ణ, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక సంబరాలు

సాక్షి, నరసరావుపేట: నరసరావుపేట డీఎస్ఏ స్టేడియంలో గణతంత్ర వేడుకలు గురువారం అంగరంగ వైభవంగా జరిగాయి. వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు, సాధారణ ప్రజలు, అధికారులతో స్టేడియం నిండిపోయింది. మువ్వన్నెల జెండాల రెపరెపలతో శోభాయమానంగా మారింది. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రభుత్వ శాఖలు తమ శకటాలను అందంగా అలంకరించి ప్రదర్శించారు. ప్రభుత్వం ఆయా శాఖల ద్వారా చేస్తున్న పనులను శకటాల ద్వారా తెలియజేశారు. శకటాల ప్రదర్శన వీక్షకులను ఆకట్టుకుంది. ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి, ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, ఇతర అధికారులు, ప్రజలు, విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు.

శకటంలో కల్యాణమస్తు



గణతంత్ర వేడుకల్లో ఏర్పాటు చేసిన కల్యాణమస్తు శకటంలో నూతన వధువరులు వివాహం చేసుకున్నారు. కర్లపాలెం మండలం గణపవరం గ్రామానికి చెందిన యెనుమల నందిని, వరుడు కర్రి నాగఫణీలు శకటంలోనే ఏర్పాటు చేసిన కల్యాణమండం సెట్‌లో శాస్త్రోక్తంగా గురువారం వివాహం చేసుకున్నారు. శకటంపై వివాహం చేసుకోవటం ఎంతో సంతోషంగా ఉందని వధూవరులు పేర్కొన్నారు. బంధుమిత్రులు సైతం శకటంలో జరిగిన వివాహానికి హాజరవగా, వీక్షకులు ఆశ్చర్యానందాల్లో మునిగి నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఉన్నతాధికారులు సైతం నూతన జంటను ఆశీర్వదించారు.

బడుగు వికాసం, పీఎంఈజీపీ రుణాలు పంపిణీ

లబ్ధిదారులకు రూ.1.20కోట్ల చెక్కులు పంపిణీ చేసిన కలెక్టర్ విజయకృష్ణన్

కర్లపాలెం: జగనన్న బడుగు వికాసం, పీఎంఈజీపీ పథకాలలో కర్లపాలెం మండల పరిధిలో మొత్తం రూ.1.20కోట్ల విలువైన రుణాలను 11మంది లబ్ధిదారులకు గణతంత్ర దినోత్సవంలో కలెక్టర్ విజయకృష్ణన్ చేతుల మీదుగా పంపిణీ చేశామని కర్లపాలెం వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం శ్రీనివాసులరెడ్డి తెలిపారు. బాపట్ల జిల్లా కేంద్రంలో జరిగిన వేడుకలలో వైఎస్సార్ క్రాంతిపథం సహకారంతో బడుగు బలహీన వర్గాలకు జీవనోపాధుల గ్రౌండింగ్ మేళా గురువారం నిర్వహించారు. జగనన్న బడుగు వికాసం పథకంలో ఏడుగురు లబ్ధిదారులకు కలెక్టర్ విజయకృష్ణన్ చేతుల మీదుగా యూనియన్ బ్యాంకు నుంచి 2, ఇండియన్ బ్యాంక్ నుంచి ఒకటి, స్టేట్ బ్యాంకు నుంచి నాలుగు కార్లు, మరొక లబ్ధిదారునికి ప్రైవేటు బ్యాంకు నుంచి పొక్లెయిన్ అందజేశారు. పీఎం ఈజీపీ పథకంలో ఇద్దరికి టెంట్‌హౌస్, ఇద్దరికి పిండి మిల్లులకు రుణాలు మంజూరు చేసినట్లు ఏపీఎం వివరించారు. డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ బి.అర్జున్‌రావు, బాపట్ల ఏరియా కో-ఆర్డినేటర్ ఎ.లక్ష్మణాచారి, మండల సమైఖ్య అధ్యక్షురాలు సీహెచ్ ధనలక్ష్మి, సీసీలు పూర్ణ చంద్రరావు, శివకోటేశ్వరరావు, లక్ష్మీసోమేశ్వరి, వీఓఏలు పాల్గొన్నారు.

రూ.8.51కోట్ల విలువైన వాహనాలు అందజేత..

బాపట్ల: గణతంత్ర వేడుకల్లో భాగంగా గురువారం డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో వాహనాలు, యూనిట్లను లబ్ధిదారులకు జిల్లా కలెక్టర్ కె.విజయకృష్ణన్ పంపిణీ చేశారు. రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా రూ.8.51 కోట్ల విలువైన 121 వాహనాలను పంపిణీ చేస్తున్నామని ప్రకటించారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, జిల్లా సంయుక్త కలెక్టర్ డాక్టర్ కె. శ్రీనివాసులు, డీఆర్‌డీఏ పీడీ అర్జునరావు, డీఆర్‌ఓ లక్ష్మీశివజ్యోతి, మత్స్యశాఖ జేడీ పి.సురేష్, పరిశ్రమలశాఖ జీఎం మదన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.